స్కెచ్

# మళ్ళీ ఓ తుపాను రాగూడదూ?

వల్లభనేని నారాయణరావు

లక్ష్మి యెందుకో చాలాకాలంనుంచీ నాతో చాలా వుదాసీనంగా వుంటోంది. అదేమని అడిగితే 'నీవే అలా వుంటున్నావు!" అని కసురుతుంది. వాదనలోకి దిగేతే - డొంక తిరుగుడు వాదనలోకి దిగి ఆఖరుకి నన్నే డొంక తిరుగుడుగా వాదిస్తున్నావంటుంది. నిజానికి నేనే తప్పుమార్గంలో వున్నానేమోనని చాలా ఆలోచించాను. కాని నాకేమీ పాలుపోలేదు. ఏది యేమైనా మొత్తానికి లక్ష్మికూడా బాధపడుతున్నమాట నిజం.

మా దాంపత్యంలోని మొదటి రోజుల్లోగల గాఢమైన అనురాగపు స్మృతిబలంతోనే భవిష్యత్తును గురించికూడా ఆశా సౌధాల్ని నిర్మించుకుంటూ యింతవరకూ గడుపుకుంటూ వచ్చాము. కాని పోయినకొద్దీ ఆవిధమైన జీవితం దుర్భరం అవుతోంది. లక్ష్మి బాధను చూడటం నాకు సహించరాని దవుతోంది. పోనీ అది కేవలం బాధేనా అంటే అవునో కాదో తెలీదు. ఉదేపనిగా కసురుకుంటూ వుంటుంది. కారణం చెప్పమంటే 'యేముంది? యేమీ లేదు!" అంటుంది.

"మరెందుకు అంతబాధ?" "ఏమో!" ఇలా మాట్లాడుతుంది.

నిజానికి మా దాంపత్య జీవిత సౌఖ్యానికిగల ఆటంకానికి ఆర్థిక పుష్టి తగినంత లేకపోవటం ఒక కారణమైనా దాన్ని మించిన బలంగల మా మొదటి రోజుల్లోని అనురాగం పనిచేసినట్లయితే జీవితం యింత దుర్భరంగా కనిపించేది కాదు. అక్కడికీ అడిగాను,

"ఎందుకు? నీ జీవితాన్ని యింత అసంతృప్తిమయం చేసుకుంటావు?" అని.

"జీవిత మంటే అసంతృప్తిగాక మరేమిటీ?" అని యెదురు ప్రశ్నతో జవాబిచ్చింది. ఆప్రశ్నకి లక్ష్మికి నేనేమీ సమాధానం యివ్వలేక పోయాను. కారణ మేమంటే చాలా కాలం నుంచీ అదే భావం నాలోకూడా పనిచేస్తోంది.

మొత్తానికి మాలోమాకు ఒకరిమీద ఒకరికి ఒకవిధమైన భేదభావం జనించింది. ఎప్పుడు యే వాదనలోకి దిగినా యెవరి సిద్ధాంతాల్ని వారు రక్షించుకో వారి వారి బాధ్యత అన్నట్టు వాదించుకో ప్రారంభమైంది. నాసిద్ధాంతమే సరియైనదని అనిపించుకోవాలని చేసే ప్రయత్నంలో మా సిద్ధాంతాల్లో వున్న అవకతవకలను కూడా ఉత్కృష్టమైనవిగా చూపాలనే ప్రయత్నం జాస్తి అయింది. ఇతరుల సిద్ధాంతమే మంచిది అని లోలోపల యేమైనా అనిపించినా మాలో వున్న అభిమానం దాన్ని బలవంతంగానైనా అణచివేసుకోమని శాసిస్తోంది. కారణమేమంటే మా సిద్ధాంతాన్ని వదులుకుంటే మేము చేతగాని వాళ్ళంగా తయారయినట్టేనన్న అభిప్రాయమొకటి మా నెత్తి నెక్కి కూర్చుంది. ఈవిధంగా జీవిత మొక పోరాటంగా తయారయింది. ఆ పోరాటం యెటూ తెగని పోరాటం కావటం వల్ల యేకో అర్థంకాని ఆవేదనగా తయారయింది జీవితం. ఎందుకో యెవరిమీదనో తెలియని కోపంగా తయారయింది.

ప్రపంచాన్ని బీభత్సంలో ముంచిన తుపాను రోజున మళ్ళీ నాలక్ష్మి నాదయింది. బయట ఒక్కొక్క చెట్టే పడుతున్న మోత వినిపించినప్పుడల్లా లక్ష్మి నన్ను గట్టిగా కావిలించుకుంది. ఆ గాలిలో మా పాక వూగినప్పుడల్లా లక్ష్మి హృదయం యెంతో అల్లకల్లోలమైంది. ఐనా నిశ్చలంగా నిలిచింది.

"పాక పడిపోతుందేమో!" అని నే నన్నప్పుడు

"పడనీ! పడితే యేం జేస్తాం? పాక పడినా, దెబ్బలు తగిలినా, ఆఖరుకు చావవలసి వచ్చినా మన మిద్దరమూ యేకంగా వున్నప్పుడు

మనసు దిగులెందుకు?" అంటూ నన్ను తనలో యేకం చేసుకోవాలన్నట్టు గట్టిగా కావిలించుకుంది.

నిజంగా పాక పడినప్పుడుకూడా లక్ష్మి యెక్కువ భయపడలేదు. పడిపోయిన పాకలోంచి, మనుషుల్ని యెత్తివేసే ఆ భయంకరమైన హోరుగాలి ఉధృతాన్ని ఎదుర్కొంటూ పొరుగువారి యింటికి వెళ్ళటానికి ప్రయత్నించినప్పుడు, నేను నాప్రాణాన్ని గాక లక్ష్మిని దృష్టిలో పెట్టుకున్నట్టుగానే లక్ష్మికూడా నన్ను గురించే యెక్కువ ఆందోళన పడింది.

మేము తిరిగి పాక వేసుకునే వరకూ నాకెన్నో విధాల సాయపడింది లక్ష్మి. ఏరోజుకా రోజు నాతోపాటు శ్రమపడేది. అయినా తన శ్రమను లక్ష్యపెట్టక నన్నువూరటపర్చటానికి ప్రయత్నించేది. ధైర్యం చెప్పేది. నన్నానందంలో ముంచేది.

ఆ సమయంలో నేనెంత ఆనందం అనుభవించానో నాకే తెలీదు. లక్ష్మిని నాకెంత దగ్గరకు తీసుకోటానికి సాధ్యమవుతుందో అంత దగ్గరకూ తీసుకున్నాను. లక్ష్మి హృదయానికి యెంత చేరువకు వెళ్ళటం సాధ్యమవుతుందో అంత చేరువకూ వెళ్లాను. ఒకనాడు లక్ష్మితో యిలా అన్నాను.

"మళ్ళీ యెప్పుడూ కీచులాటలోకి దిగవద్దుగా లక్ష్మీ! ఎప్పుడయినా ఒకళ్ళనొకళ్లు అర్థం చేసుకుని ఒకళ్ళ భావాలనొకళ్లు అన్వయం చేసుకోటంలో ఆనందం వుంటుంది గాని అనవసరంగా గుద్దులాడుకుంటూ బాధపడితే యేం లాభం చెప్పు! జీవితంలో సుఖాలతోపాటు బాధల్ని కూడా అనుభవించటం యెలాగూ తప్పదు. అయినప్పుడు ఆ బాధల్ని శాంతంగా ఓపికగ్గా అనుభవించటం మంచిది కానీ, ఆబాధలవల్లకలిగే అసంతృప్తిని ఒకరిమీద ఒకరు ప్రదర్శించుకుని, యితర్లని బాధపెడుతూ తాము బాధపడితే యేం లాభం!"

అవునన్నట్లు లక్ష్మి చిరునవ్వు నవ్వింది.

తుపాను స్మృతి మనసుల్లోనుంచి మరుగుపడిపోయింది. మేము మళ్ళీ పాకవేసుకుని చాలా నాళ్ళైంది. అలా నూతన గృహంలో ప్రవేశించినాక, చాలాకాలంవరకూ లక్ష్మీ నేనూ యెంతో అన్యోన్యంగా వున్నాము. క్రొత్తగా యేర్పడిన స్థిర జీవితం మాలో ఒక నూతనానందాన్ని కలిగించిరిది.

కాని యెందుకో మళ్ళీ కొన్నాళ్ళనుంచీ మాలో ఒకవిధమైన అసంతృప్తి జనించింది. నీవు చాలా వుదాసీనంగా వున్నావని నేనంటే-నీవే అలా వున్నావని లక్ష్మి అంటుంది. మళ్ళీ వెనకటి కీచులాటలు, పోరాటం, అర్థంకాని ఆవేదన. ఎందుకోయెవరిమీదనో తెలియని కోపం. ఒంటరి జీవితాన్ని గడుపుతూ బాధపడినన్నాళ్లూ కలయికజీవితానికై మేముపడిన ఆ ఆరాటం మేము కలుసుకున్నాక యేంతో కాలంవరకూ మా జీవితాలు వుత్తేజంగా సంతృప్తిగా ఉండటానికి కారణమైంది.

అసంతృప్తిలో పడి తన్నుకుంటూ ఒకరితో ఒకరం కీచులాడు కోటంలో పడిన మాకు తుపాను ప్రకృతి క్రూరశక్తికి ప్రతినిధిగా వచ్చి, జీవితంలో కష్టాలలోనైనా సుఖాలలోనైనా ఐక్యంగా పోవలసిన అవసరాన్ని, జీవితం మాలో కలిగించే అసంతృప్తివల్ల కలిగిన కోపాన్ని ఒకరిమీదికి ఒకరంగాక తనమీదికి ప్రసరించాల్సిన అవసరాన్ని చూపించి వెళ్ళింది.

మళ్ళీ అసంతృప్తి బయలు దేరింది. కాని ఒక తేడావుంది. ఇప్పటి యీ అసంతృప్తివల్ల కలిగిన కీచులాటలూ, బాధలు, యిది వరకటి అసంతృప్తివల్ల కలిగినవాటంత నికృష్టంగా లేవు. ఒక విధమైన సదభివృద్ధి స్పష్టంగా కన్పించుతోంది. ఇప్పుడునే నేమనుకుంటున్నానంటే- సంతృప్తిలోనైనా అసంతృప్తిలోనైనా జీవితంలో శాంతాన్ని మాత్రం వీడకుండా జీవించగలిగే శక్తి మాకు సిద్ధించేవరకూ, ఆ తుపానులాంటిదే యేదో అప్పుడప్పుడూ వస్తూ పోతూవుండకూడదూ అని!

చచ్చిపడివున్న సింహాన్ని చూసి మొరగడానికి ధైర్యమైన కుక్కే అవసరం లేదు.—ఆంగ్ల సామెత.